ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 10 డిసెంబరు 2025






ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధికి పట్టం కట్టండి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని దుబ్బపల్లి, చెల్పూరు, కర్కపల్లి, లక్మారెడ్డిపల్లి, గణపురంలో డీసీసీ ప్రెసిడెంట్ భట్టు కర్ణాకర్‌తో కలిసి ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పోసే కాలం..



ఊగుతున్న ఊళ్లు

కిక్కెస్తున్న పంచాయతీ ఎన్నికలు

- పెద్ద మనుషులు, కులసంఘాలు, క్యాడర్‌కు రాత్రైతే చీర్స్..
- నాటు కోడి, మటన్, బోటి, తలకాయ సూపు, చికెన్ ఫ్రైతో అభ్యర్థుల కాక
- చీప్ లిక్కర్‌కు నై.. బ్రాండెడ్ విస్కీకే సై.. షాపుల్లో క్వార్టర్స్‌కు ఫుల్ డిమాండ్
- మద్యానికే రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పైగా వ్యయం
- ఉమ్మడి జిల్లాలో రూ.60కోట్లకు పైగా మద్యంపైనే ఖర్చు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంచాయతీ పోరు పల్లెను మత్తెక్కిస్తోంది. రాత్రైతే చీర్స్‌తో ఊరు చిందులేస్తోంది. పెద్ద మనుషులు, కుల, యువజన సంఘాల మద్దతు కోసం అభ్యర్థులు మందును ఎరగా వేస్తున్నారు. మనీకి లొంగని నేతలను మద్యంతో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక పొద్దంతా ప్రచారంలో వెంట తిరిగే క్యాడర్‌ను చీకటి పడితే చాలు మందు, విందులతో చేజారకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎన్నికల ఖర్చులో సగానికిపైగా మద్యం కోసం అభ్యర్థులు వెచ్చిస్తున్నారు. మొదటి విడత ప్రచారం పూర్తి కావటంతో ఇక మద్యంతో పాటు ఇతర ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేసే పనిలో అభ్యర్థులు బిజీగా వున్నారు.

ఖర్చులకు తగ్గేదేలే..

ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు చాలా చోట్ల ఖర్చులకు తగ్గేదేలే అంటున్నారు. ఎన్నికల ప్రచారాన్ని అసెంబ్లీ ఎన్నికలకు తీసిపోకుండా నిర్వహిస్తున్నారు. ప్రచార వాహనాలతో పాటు కొన్నిచోట్ల అభ్యర్థులు ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను రంగంలోకి దించి ప్రచారం చేస్తున్నారు. ఖర్చు ఎంతైనా పర్వాలేదు.. ఒక్కసారి ఊరికి సర్పంచ్ కావాలే.. అనే లక్ష్యంతో ఓట్ల కోసం నోట్లను నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. వలస వెళ్లిన ఓటర్లకు ప్రత్యేకంగా వాహనాలు, ఇతర ఖర్చులు కూడా సర్దేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. రిజర్వేషన్ కలిసి వచ్చిన వాళ్లు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తున్నారు.

మద్యంతో దావత్‌లు.. కోట్లల్లో అమ్మకాలు

ఒకప్పుడు పోలింగ్‌కు ఒకరోజు ముందే మద్యం, మనీ వంటివి పంపిణీ చేసేవారు. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం రిజర్వేషన్లు ఖరారు కాకముందు నుంచే ఆశావహులు మద్యం దావత్‌లు ఏర్పాటు చేయటం మొదలు పెట్టారు. రిజర్వేషన్లు ఖరారైన తరువాత దావత్‌లు పతాకస్థాయికి చేరుకున్నాయి. గుర్తులు కేటాయించకముందే తనను గుర్తుపెట్టు కోండంటూ దావత్‌లతో (మిగతా 7వ పేజీలో)

పల్లెలో ఓట్ల పండుగ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు విడతలుగా జరుగుతున్న ఎన్నికల్లో తొలివిడత 11వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం సాయంత్రం ప్రచారం నిలిపివేశారు. మరోవైపు మూడో విడత ఎన్నికలకు సంబంధించి మంగళవారం గుర్తుల కేటాయింపులు చేశారు. కాగా, ఎన్నికల పర్వం పల్లెల్లో పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. గ్రామ కూడళ్లలో ఏ నలుగురు కలిసిన ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది. ఆయా పార్టీల మద్దతుతో పాటు స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలపైన పల్లెజనం బేరీజు వేసుకుంటున్నారు.

పార్టీరహి తంగా ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రచారం పర్వంలో అభ్యర్థులు తనకు మద్దతు ఇచ్చే పార్టీ కడువాలతోనే ప్రచారం చేస్తున్నారు. పొద్దంతా ప్రచారంతో అభ్యర్థులు రాజకీయాల ను వేడెక్కిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారికి ఫోన్‌లో అభ్యర్థులు పలకిరిస్తున్నారు. ఓటింగ్ రోజు తప్పకుండా ఊరికి రావాలని, రానుపోను ఖర్చులతో పాటు ఇతర ఆఫర్‌లు కూడా ఇస్తున్నారు.



పల్లె పోరు ప్రలోభాల జోరు

- ముగిసిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచార పర్వం
- ములుగు జిల్లాలో మూడు మండలాల్లో ఎన్నికలు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల ప్రయత్నాలు
- విందులతో మచ్చిక చేసుకుంటున్న వైనం

ములుగు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారానికి మంగళవారం తెరపడింది. ఓటర్లను నేరుగా కలిసి ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటి వరకు ప్రయత్నం చేసిన అభ్యర్థులు ఆ పర్వానికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే ప్రలోభాలకు తెరతీశారని తెలుస్తోంది. ములుగు జిల్లాలో మొదటి విడతలో ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈనెల 11న ఈ మూడు మండలాల్లో పోలింగ్ ఉంది. ఈ క్రమంలో అభ్యర్థులు ఓటర్లకు గాలం వేసేందుకు నానాతంటాలు పడుతున్నారని తెలుస్తోంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. అభ్యర్థుల అనుచర వర్గం క్షేత్ర స్థాయిలో తిరుగుతూ ఓటర్లతో బేరసారాలు సాగిస్తున్నట్టు సమాచారం.


గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 9 జీపీలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే... కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బలపరిచిన అభ్యర్థులను మేజర్ గ్రామ పంచాయతీల్లో గెలిపించుకునేందుకు నాయకులు జోరుగా ప్రచారాలు సాగించారు. ప్రధానంగా ఏటూరునాగారంలో మంత్రి సీతక్క తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు అక్కడే తిష్టవేశారని తెలిసింది. కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు తన సతీమణిని సర్పంచ్‌గా గెలిపించుకునేందుకు గ్రామానికి, ప్రజలకు తాను చేసిన సేవలను గుర్తుచేస్తున్నారు. ప్రచారం చివరి రోజు ఇరు పార్టీల నాయకులు మండల కేంద్రంలో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించారు. గురువారం పోలింగ్ జరగనుండటంతో అదే రోజు అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

గంపగుత్తాగా ఓట్లు దండుకునే ప్రయత్నాలు

మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ (మిగతా 8లో..)

ఇక మూగనోము!

- ముగిసిన ఎన్నికల ప్రచార పర్వం
- భూపాలపల్లి జిల్లాలో నాలుగు మండలాల్లో మొదటి విడత ఎన్నికలు
- 11న 73 సర్పంచ్, 712 వార్డు స్థానాలకు పోలింగ్



భూపాలపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెరపడింది. గణపురం, రేగొండ. కొత్తపల్లిగోరి, మొగుళ్లపల్లి మండలాలకు ఎన్నికలు జరగనుండగా ఈనెల 11న పోలింగ్ జరగనుంది. మొదటి విడతలో మొత్తం 82 గ్రామ పంచాయతీలకు 9 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ప్రస్తుతం 73 గ్రామపంచాయతీలు , 712 వార్డులకు బ్యాలెట్ పోరు జరగనుంది. ఈ నాలుగు మండలాల్లో మొత్తం 259 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1282 మంది వార్డు మెంబర్ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం పోలింగ్ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ముఖ్యంగా ఈ నాలుగు మండలాల్లోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక భద్రత చర్యలను చేపట్టారు, పోలింగ్ గురువారం జరిగనుండగా అదే రోజు ఫలితాలు వెలవడనుండటంతో గ్రామాల్లో ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బలగాలను మోహరించారు. సుమారు 500 మందితో పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. పోలింగ్‌కు మరో 24 గంటలు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులంతా ఓటర్లను ఆకట్టుకునే పనిలో తలమునకలయ్యారు. ఇప్పటికే ఈ ఎన్నిక అధికార కాంగ్రెస్‌కు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు.

తెలంగాణ స్ఫూర్తి తరతరాలుగా వికసించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్ఫూర్తి తరతరాలుగా వికసించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి తెలంగాణ తల్లి ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీవో రవితోపాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క గద్దెకు మొదటి స్తంభం ఎత్తిన పూజారులు



గద్దెకు మొదటి స్తంభం వద్ద పూజలు చేస్తున్న పూజారి

తాడ్వాయి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో దేవస్థానం ఆధునీకరణ పనుల్లో భాగంగా సమ్మక్క గద్దెకు మొదటి రాతి స్తంభాన్ని పూజారులు నిలబెట్టారు. మంగళవారం కార్యక్రమానికి ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ హాజరయ్యారు. ఎస్పీ కొబ్బరికాయ కొట్టగా పూజారులు ప్రత్యేక పూజలు చేసి గద్దె స్తంభాన్ని నిలబెట్టారు. ఈ క్రమంలో సమ్మక్క గద్దె రాతి పనులు ప్రారంభమయ్యాయి. పూజారులు, అధికారులు, పోలీసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

- మృతదేహాన్ని మట్టి గుట్టల వద్ద పడేసిన డ్రైవర్
- భూపాలపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



రాకేష్ మృతదేహం



రాకేష్ (ఫైల్)

గణపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సరదాగా ట్రాక్టర్ ఎక్కి కూర్చున్న బాలుడు జారి పడ్డాడు. టైర్ కింద నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో తోచలేదు డ్రైవర్‌కు. బాలుడి మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించాడు. గోనె సంచిలో మృతదేహాన్ని వేసి గుట్టచప్పుడు కాకుండా ఓపెన్‌కాస్టు మట్టి గుట్టల వద్ద పడేశాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గణపురం మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన బందెల రాజు-రజిత దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న (మిగతా 8వ పేజీలో..)

పేదల పక్షపాతి కాంగ్రెస్

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షపాతి పార్టీ కాంగ్రెస్ అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏటూరునాగారంలో మంత్రి మంగళవారం పర్యటించారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్టాండ్ ఆవరణ నుంచి ఓడవాడ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. మండల కేంద్రంలోని సీసీ రోడ్ల నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు, అగ్నిమాపక కేంద్రం, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టినట్టు వివరించారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మండలంలో 200 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టామని, రెండో విడతలో మరిన్ని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు
- అక్కడికక్కడే తండ్రి మృతి
- కొడుకు పరిస్థితి విషమం



సంజీవరెడ్డి మృతదేహం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఏటూరునాగారం మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన కాసం సంజీవరెడ్డి(65) తీవ్ర జ్వరం బారిన పడ్డాడు. దీంతో ఆయన్ను కొడుకు భరత్‌రెడ్డి ద్విచక్రవాహనంపై చిన్నబోయినపల్లి గ్రామంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో అదే గ్రామంలోని జాతీయ రహదారిపై ఏటూరునాగారం నుంచి హనుమకొండకు (మిగతా 8లో..)

ఎన్నికల ప్రక్రియ బాధ్యతగా నిర్వహించాలి


ప్రిసైడింగ్ అధికారుల ఎన్నికల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణకిషోర్

తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్

తొర్రూరురూరల్, డిసెంబరు 08(ఆంధ్రజ్యోతి) : ప్రిసైడింగ్ అధికారులు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తమతమ బూత్‌లో శాంతి యుతంగా నిర్వాహించాల్సిన బాధ్యత వారిపైన ఉంటుందని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ అన్నారు. రెండో విడత ఎన్నికల నిర్వహణ పై తొర్రూరు ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని ఫత్తేపూరం గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ ఎన్నికల పక్రియ శాంతియుతంగా జరిగే విధంగా చూడాలని, అభ్యర్థులు, ప్రజల నుండి ఏమైన సమస్యలు తలెత్తినపుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా శిక్షకులు రాములు ఎన్నికల నిర్వహణ ఏవిధంగా నిర్వహించాలి, సీల్ వేయడం, తీయడం, బ్యాలెట్ పత్రాల ఏర్పాటు, ఎన్నిక తర్వాత కౌంటింగ్ విధానం, ఓటర్ల నుండి వచ్చిన ఫిర్యాదులను ఏలా పరిష్కరించాలనే విషయాలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో సీఐ గణేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఉపేందర్, ఎంఈవో బుచయ్య, ప్రిసైడింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతికి భంగం కలిగిస్తే క్రిమినల్ కేసులు

దంతాలపల్లి : స్థానిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో చట్టాన్ని అతిక్రమిస్తే ఎట్టివారికైనా సహించేది లేదని తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిషోర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 25 నుంచి 144 సెక్షన్‌ను అమలులో ఉంచామన్నారు. ఈ నెల నవంబరు 30 నుంచి 15 వరకు నామినేషన్లు స్వీకరించాలని, డిసెంబరు 14న జరిగే స్థానిక(సర్పంచ్) ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. బెల్టు షాపుల్లో మద్యం అమ్మితే క్రిమినల్ కేసులకు చర్యలు తీసుకుంటామన్నారు. 14న పోలింగ్‌తో పాటు ఫలితా లను వెల్లడిస్తారన్నారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని వారు కోరారు. పోలింగ్ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు అందుబాటులో ఉండి సేవలను అందిస్తారన్నారు. శాంతికి భంగం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో విజయ, ఎంపీవో అఫ్సర్‌పాషా, మండల ప్రత్యేక అధికారి దేశిరాంనాయక్ పాల్గొన్నారు

స్వస్తిక్ గుర్తుతో ఓటు వేసేలా అవకాశం ఇవ్వాలి

పాలకుర్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లను సాధారణ ఓటర్ల మాదిరిగానే స్వస్తిక్ గుర్తుతో ఓటు వేసే హక్కు కల్పించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిదిరుల శ్రీనివాస్ ఎన్నికల కమిషన్‌ను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వేసిన పోస్టల్ ఓట్లను సాధారణ ఓట్లతో లెక్కించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్లను ముందుగా లెక్కించడంతో ఓటు రహస్యం బహిర్గతమవుతుందన్నారు. అందుకు స్వస్తిక్ గుర్తుతో ఓటును వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలని కోరారు. వెంటనే ఎన్నికల కమీషన్ ఉత్వర్వులు జారీ చేయాలని కోరారు. ఆయన వెంట దేవగిరి సూర్యప్రకాష్ ఉన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా కార్యదర్శిగా సోమేశ్వర్



జఫర్‌గడ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ (ఎన్‌జీఓ సంస్థ) జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జఫర్‌గడ్‌కు చెందిన దాంశెట్టి సోమేశ్వర్ నియమితుల య్యారు. ఈ మేరకు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సంపత్, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియామకంపై సోమేశ్వర్ సంతోషం వ్యక్తం చేస్తూ సాంఘిక దురాచారాల నిర్మూలనకు, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సోమేశ్వర్‌ను మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అభినందించి సత్కరించారు.

క్షయ వ్యాధి నియంత్రణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డాక్టర్ రవినాయక్

మరిపెడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నియంత్రణ అందరి బాధ్యత అని మరిపెడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ మండల ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎడతెరిపిలేని దగ్గు, జలుబు ఉంటే వైద్య పరీక్షలు చేసుకోవాలని రోగులకు సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంగమ్మ, సుదర్శన్, ఆచార్యులు, సందీప్, లక్ష్మీకుమారి, వీరయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి

● జిల్లాలో వంద మంది సర్పంచ్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ● డీఎస్‌ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వివేక్


అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న డీఎస్‌ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్

నర్సింహులపేట(మహబూబాబాద్ క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యో తి): విద్యావంతులను సర్పంచ్‌లుగా ఎన్నుకొని గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముందుకు సాగాలని, మహబూబాబాద్ జిల్లాలో వందమంది సర్పంచ్ అభ్యర్థులకు డీఎస్‌ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలిపి గెలుపు కోసం కృషి చేస్తున్నట్లు భారత ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ అన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి, బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ఎర్ర వెంకట్రామ్‌నర్సయ్యకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వంద మంది సర్పంచ్ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలుపులో ప్రత్యక్ష బాగస్వామ్యం అవుతున్నామని తెలిపారు. గ్రామాల్లో విద్యావంతులను సర్పంచ్‌లు గా గెలిపించుకొని గ్రామా భివృద్ధి కోసం పాలుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సతీష్, యాకన్న, రామూర్తి, వీరన్న, మధు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

మరిపెడ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):నల్లబెల్లం విక్రయించిన, గుడుంబా తయారు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మరిపెడ మండలంలోని సోమ్లా తండా గ్రామ పంచాయతీలో కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు 200 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసి, ఆరుగురిపై కేసు నమోదు చేశారు. గుడుంబా తయారు చేస్తున్న భూక్యా బావ్‌సింగ్, భూక్యా బీకా, భూక్యా రాజు, భూక్యా రవి, భూక్యా శ్రీను, భూక్యా మికిలీ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడులలో ఎస్సైలు వీరభద్రరావు, కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి


పోచారంలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పెద్దవంగర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్‌బీతండా, బీసీతండా, చిన్నవంగర, బావోజీతండా, చిట్యాల, బొమ్మకల్, రెడ్డికుంటతండా, పోచారం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి సర్కారు పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తోందని, ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎం రేవంత్ కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని తెలిపారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియాజేయాలన్నారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోని సర్పంచ్ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నిరంజన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జీ విజయ్‌పాల్‌రెడ్డి, నెహ్రూనాయక్, రామకృష్ణరెడ్డి, విక్రమ్‌రెడ్డి, గోపాల్‌నాయక్, వెంకన్న, ఉపేందర్‌రెడ్డి, సైదులు, శ్రీనివాస్, సీతారామ్, కర్ణాకర్, జగ్గానాయక్, రవీందర్, హరికృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ మంత్రి డీఎస్.రెడ్యానాయక్


కుమ్మరికుంట్లలో మాట్లాడుతున్న మాజీమంత్రి రెడ్యానాయక్

దంతాలపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మాజీమంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం రెడ్యానాయక్ మండల కేంద్రంతో పాటు ఆగపేట, తూర్పుతండా, దుబ్బతండా, వేములపల్లి, కుమ్మరికుంట్ల, రామానుజపురం, గున్నేపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారన్నారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులకు సరిపడా యూరియా, రైతు బంధు, కల్యాణలక్ష్మి ద్వారా సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రజల్లో తీసుకెళ్లారన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం పేరిట మోసం చేసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదించాలన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధికి నిత్యం దర్పణంలో కనబడుతుందన్నారు. గత ప్రభుత్వం సాగునీటి, తాగునీటి వసతులను కల్పించిందన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు వలాద్రి మల్లారెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు

మహబూబాబాద్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన పలువురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని, కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. రౌడీ షీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని స్లీపింగ్ విధానంలో ఉండకుండా, ఘర్షణకుల పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రశాంత్, ఎస్‌కె షాకీర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

ఏటూరునాగారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని లంబాడీతండా గ్రామ శివారు పొలాల్లో గుర్తుతెలియని ఓ వృద్ధుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వృద్ధుడు సుమారు వారం రోజులుగా మతిస్థిమితం లేకుండా మండల పరిధిలోని రామన్నగూడెం, రాంనగర్, లంబాడీతండా పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ కనిపించాడు. ఈ క్రమంలో లంబాడీతండా పరిధిలోని ఓ దుక్కి దున్నిన పొలంలో బోరు వద్దకు దాహార్తిని తీర్చుకోవడానికి వెళ్లినట్లు స్థానికులు భావిస్తున్నారు. పొలంలో ఉన్న బురదలో చిక్కుకుని బయటకు రాలేక మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

హామీలపై చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


కాన్వాయిగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక రెండేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కాన్వాయిగూడెం, గంట్లకుంట, ఉప్పరగూడెం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్‌ప్లాప్ అయ్యిందని, ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజమెత్తారు. పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతి రైతులను ఆదుకున్నామని, సబ్బండవర్గాలకు అండగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ రాగానే కరువు, యూరియా కష్టాలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క నియోజకవర్గంలో కూడా అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, ఆ పార్టీ దొంగ హామీలను ప్రజల్లో ఎండగట్టేది బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాకనాటి సునిల్‌రెడ్డి శ్రీరాం సుధీర్, సంజయ్, యాదగిరిరావు, భాస్కర్, సమ్మయ్య, వెంకన్న, శ్రీను, రఘు, హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి రైతు నిరసన

ధాన్యం లోడింగ్‌లో జాప్యానికి మనస్తాపం


సెల్ టవర్‌పై ఉన్న రైతు మురళి

కేసముద్రం, డిసెంబరు9, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తన వడ్ల బస్తాలను వ్యానులోకి లోడ్ చేయడం లేదని ఆరోపిస్తూ మంగళవారం ఓ రైతు సెల్‌టవర్ ఎక్కడంతో కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం. అదే గ్రామానికి చెందిన ఏశబోయిన మురళి ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు సరుకు తీసుకురాగా మూడు రోజుల క్రితం వడ్లను బస్తాల్లోకి నింపి, కాంటాలు పూర్తి చేశారు. ఎగుమతి చేసేందుకు వ్యాన్ రాగా తన బస్తాలను కావాలనే లోడ్ చేయడం లేదని ఆరోపిస్తూ సమీపంలోని సెల్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని సముదాయించేందుకు ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయత్నించారు. ఈ క్రమంలోనే మురళి తన వద్దనున్న సెల్‌ఫోన్‌ను, చెప్పులను టవర్ నుంచి కిందపడేయడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొద్ది సేపటి తర్వాత టవర్ కిందకు దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం నిర్వాహకులు మురళి బస్తాలను వ్యాన్‌లో లోడ్ చేయించి పంపించారు.

కాలిపోతున్న పంటను చూసి ఆగిన రైతు గుండె


నారాయణ (ఫైల్)

వాజేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చుట్టు పక్కల ఉన్న పంటలు కాలిపోతుండగా ఆ మంటలు తమ పంటకు ఎక్కడా అంటుకుంటాయోనని భయాందోళనకు గురైన రైతు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలోని మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడ్జర్లపల్లికి చెందిన రామెల్ల నారాయణ (55) తనకున్న ఎకరం పొలంలో వరి పంట సాగుచేశాడు. ఇటీవల పంటను కోసి కుప్పగా పేర్చాడు. ఈక్రమంలో చుట్టుపక్కల రైతులు తమ పొలాల్లోని ఎండుగడ్డిని కాల్చేందుకు మంట పెట్టారు. అది కాస్త వ్యాపించి నారాయణ వరి కుప్ప దగ్గరికి సమీపించింది. అప్పటి వరకు తన మిర్చి తోటలో పనిచేసుకుంటున్న నారాయణ మంటలను గమనించి ఉరుకులు పరుగులతో వరి కుప్ప వద్దకు చేరుకున్నాడు. చుట్టూ అంటుకుంటున్న మంటలను ఆర్పే ప్రయత్నిస్తూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. దీంతో చుట్టుపక్కల రైతులు గమనించి అతడిని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే నారాయణ మరణించాడని వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

చెక్ పోస్టును తనిఖీ చేసిన అబ్జర్వర్

మహదేవపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఎన్నికల జిల్లా పరిశీలకుడు ఫణీంద్రరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మెట్‌పల్లిలోని ఎన్నికల కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు తదితర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అనంతరం కాళేశ్వరంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట మహదేవపూర్ ఎంపీడీవో రవీంద్రనాథ్, కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీ ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. వాజేడు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వై-జంక్షన్ వద్ద మలుపు తీసుకుంటున్న సమయంలో హనుమకొండ వైపు వేగంగా వస్తున్న ఇసుకలారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న పూనెం దేవేంద్ర, కుంజా సతీష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని సమీపంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిని అక్కడి డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు రిఫర్ చేశారు.

మౌలాలి రైల్వేస్టేషన్‌లో మరమ్మతులు

ఈ నెల 21న చర్లపల్లి వరకే పలు రైళ్లు

కాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మౌలాలి రైల్వేస్టేషన్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు, పలు మరమ్మతు పనుల దృష్ట్యా ఈ నెల 21న సికింద్రాబాద్ - మౌలాలి మధ్య నడిచే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12706) సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, (12757) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్‌డౌన్, (17202) సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, (67764) కాజీపేట - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే అప్‌అండ్‌డౌన్ పుష్ పుల్, (20101) నాగ్‌పూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లు ఈ నెల 21న చర్లపల్లి రైల్వేస్టేషన్ వరకే నడుస్తాయని, తిరిగి చర్లపల్లి నుంచే ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 22న తిరిగి ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయని చెప్పారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ, సికింద్రాబాద్ - చెన్నై రూట్‌లలో నడిచే పలు రైళ్లు ఈ నెల 21న దారి మళ్లించి నడిపిస్తున్నామని చెప్పారు.

అట్టహాసంగా సింగరేణి భద్రతా పక్షోత్సవాలు


మాట్లాడుతున్న ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో 5వ గనిలో భద్రతా పక్షోత్సవాలను మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతకు సింగరేణి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. సింగరేణి ఉద్యోగులు సురక్షితంగా విధులు ముగించుకోవాలన్నదే యాజమాన్య ధ్యేయమన్నారు. ఉద్యోగుల చిన్న తప్పిదాల వల్ల పెద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని, ప్రతి ఒక్కరూ రక్షణతో కూడిన విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కన్వీనర్ శ్రీనాథ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.లక్ష్మణ్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ అఫ్సర్‌పాషా, జూనియర్ సర్వే ఆఫీసర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతతోనే అవినీతి నిర్మూలన

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, నైతికతను పెంపొందించడం ద్వారా అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 3 నుంచి 9 వరకు అవినీతి నిర్మూలన వారోత్సవాలను పురస్కరించుకుని ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి చేయాల్సిన సేవలకు లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు కాల్‌చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, సీఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం కార్యవర్గం ఎన్నిక

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భూపాలపల్లి పట్టణానికి చెందిన శ్రీచతుర్రూప అయ్యప్పస్వామి దేవాలయం ప్రధాన పూజారి కుదురుపాక కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా బలబత్తుల రాజేశ్వరచార్యులు, కోశాధికారిగా తంగెళ్లపల్లి వెంకటాచార్యులు ఎన్నికయ్యారు.

వర్గాన్ని కాదు..

వ్యక్తిని చూసి ఎన్నుకోండి

వర్ధన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మీ గ్రామం అభివృద్ధి చెందలేదని బాధపడుతున్నారా? రహదారులు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? ఇప్పటిదాక ఎన్నికైన సర్పంచులు రాజకీయాలు చేయడం మినహా ప్రగతి మరిచిపోయారని ఆవేదన చెందుతున్నారా? అలాంటి బాధలకు తెరదించే రోజు వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ నెల 11, 14, 17తేదీల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి.. మంచి లక్షణాలు ఉన్న అభ్యర్థిని ఎంచుకోండి. వ్యక్తిగత ప్రయోజనం కన్నా ప్రజల ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వండి.

సర్పంచుకు ఉండాల్సిన లక్షణాలు

గ్రామస్థులకు నిత్యం అందుబాటులో ఉండాలి. బాధితుల సమస్యను చిత్తశుద్ధితో విని పరిష్కారానికి కృషి చేయాలి. కులం, వర్గం, పార్టీ, బంధువులు అన్న తారతమ్యం చూపకుండా అందరినీ సమానంగా చూడాలి. గ్రామ నిధులను పారదర్శకంగా వినియోగించాలి. ప్రతీ పైసాను ప్రజల అవసరాలకే వెచ్చించాలి. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి అవి అర్హులకు అందేలా చొరవ చూపాలి. గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. గ్రామ సమస్యలపై త్వరగా పరిష్కరించాలి. రోడ్లు, నీరు, విద్యుత్, పాఠశాలలు, వైద్య సదుపాయాలు, యువతకు అవకాశాలు.. ఇలా అన్ని అంశాల్లో అభివృద్ధికి కృషి చేయాలి. గ్రామసభలు నిర్వహించి ఆర్థిక వివరాలు ప్రజలకు తెలుపాలి. ఎవరు ఏం అడిగినా నిజాయితీగా సమాధానం ఇవ్వాలి. గొడవలు, కేసులు, కొట్లాటలు జరగకుండా చూడాలి. ప్రజల మధ్య సత్సంబంధాలు పెంచాలి. గ్రామంలో శాంతిని నెలకొల్పాలి.



తొలి విడతకు భారీ బందోబస్తు

- వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 11 మండలాల్లో పోలింగ్
- ఇప్పటికే 156 లైసెన్స్‌డ్ తుపాకులు స్వాధీనం
- 1,470 మంది బైండోవర్
- విధుల్లోకి 1,800 మంది సిబ్బంది

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న జరిగే మొదటి విడత పంచాయతీ పోలింగ్‌కు పోలీసులు పకడ్బందీగా బందోబస్తు సిద్ధం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు జిల్లాల (వరంగల్, హనుమకొండ, జనగామ) పరిధిలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా 152 లైసెన్స్‌డ్ తుపాలకుల స్వాధీనం చేసుకోవడంతోపాటు రౌడీషీటర్లతో పాటు ఎన్నికలకు విఘాతం కల్గించే వ్యక్తులను బైండోవర్ చేశారు. పోలింగ్ జరిగే గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కఠినమైన చర్యలు ఉంటాయని గ్రామాల్లో పోలీస్ కవాతుతో హెచ్చరించారు.

విధుల్లో 1,800 మంది పోలీసులు

రాష్ట్రమంతా ఎన్నికలు జరుగుతున్నందున బయట జిల్లాల నుంచి పోలీసులు వచ్చే అవకాశం లేనందున కమిషనరేట్‌లోని అధికారులు, సిబ్బందితోనే మూడు విడతలకు రొటేషన్ పద్ధతిలో బందోబస్తు విధులకు వినియోగించనున్నారు. డీసీపీల నుంచి హోంగార్డు వరకు ప్రతీ ఒక్కరికి బందోబస్తు డ్యూటీని కేటాయించారు. వారిలో జోన్‌ల వారీగా ఉన్న ముగ్గురు డీసీపీలతో పాటు ముగ్గురు అదనపు డీసీపీలు, 12 మంది ఏసీపీలు, 23 మంది సీఐలు, 100 మంది ఎస్సైలు, 11 మంది మహిళా ఎస్సైలు, 56 మంది ఏఎస్సైలు, మహిళా ఏఎస్సైలు, 200 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 730 మంది కానిస్టేబుల్స్, 200 మంది మహిళా కానిస్టేబుల్స్, ఏఆర్ సిబ్బంది విధుల్లో నిమగ్నం కాబోతున్నారు. కమిషనరేట్ సరిహద్దుల్లో ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి అక్రమ మద్యం, నగదును నివారించేందుకు ఆరు చెక్‌పోస్టులు ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ రూట్‌లో పెంబర్తి, మహబూబాబాద్ రూట్‌లో వేపచెట్టుతండా, ఖమ్మం రూట్‌లో రాయపర్తి, కరీంనగర్ రూట్‌లో పెంచికలపేట, మరో రెండు రూట్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఏమైనా అల్లర్లు చోటుచేసుకుంటే తక్షణమే అక్కడికి చేరుకొని ఘర్షణలను అదుపులోకి తెచ్చేందుకు స్థానిక ఏసీపీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, సీఐ, ఎస్సై ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.

270 గ్రామ పంచాయతీలపై ఫోకస్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా మూడు విడతల్లో 35 మండలాల్లోని 807 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. మొదటి విడతలో భాగంగా 11 మండలాల్లోని 270 గ్రామ పంచాయతీల్లో నిర్వహించే పోలింగ్‌పై పోలీసు యంత్రాంగం మొదటగా దృష్టిసారించింది. 270 పంచాయతీల్లో 95 రూట్‌లుగా విభజించి 193 సాధారణ, 77 సమస్యాత్మక పంచాయతీలను గుర్తించి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలతో పాటు కమిషనరేట్ కార్యాలయంలోని ఎస్‌బీ, ఎలక్షన్ సెల్, పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయనున్నారు.

మద్యం షాపులకు సీల్

- తొలి విడత ఫలితాలు వచ్చే వరకు మూసివేత
- 6 మండలాల్లో బంద్ అమలు



మద్యం షాపునకు సీల్ వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల మొదటి విడతలో పోలింగ్ జరిగే గ్రామాల పరిధిలోకి వచ్చే వైన్, బార్‌షాపులకు అబ్కారీ అధికారులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీల్ వేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే వరంగల్ అర్బన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్‌లో కొనసాగుతున్న 14 వైన్ షాపులతో పాటు ఒక బార్ షాపుకు ఎక్సైజ్ సీఐలు దుర్గా భవాని, చంద్రమోహన్ ఆధ్వర్యంలో సీల్ వేసినట్లు సూపరింటెండెం ట్ చంద్రశేఖర్ తెలిపారు. అదే విధంగా వరంగల్ రూరల్ ఎక్సైజ్ పరిధిలోకి వచ్చే వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరిలో పోలింగ్ జరిగే ప్రాంతాల పరిధిలోకి వచ్చే సుమారు 6 మద్యం షాపులకు సీఐ స్వరూప ఆధ్వర్యంలో సీల్ వేసినట్లు సూపరింటెండెంట్ అరుణ్ తెలిపారు. 11న పోలింగ్ ఫలితాలు వచ్చే వరకు ఆయా గ్రామాల పరిధిలో మద్యం షాపులు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండున్నర రోజులు మద్యం విక్రయాలు జరగకుండా ఆయా ఎక్సైజ్ ఠాణాల అధికారులతో పాటు అబ్కారీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

173 వాహనాలు సీజ్

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం రాత్రి కమిషనరేట్ వ్యాప్తంగా 57 ప్రాంతాల్లో నిర్వహించిన నాకాబందీలో 8,259 వాహనాలు తనిఖీలు చేసి 173 వాహనాలు సీజ్ చేసినట్లు సీపీ వెల్లడించారు. 7 అక్రమ మద్యం రవాణా కేసులు నమోదు చేసి లక్ష 18వేల మద్యంతో పాటు 3 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా రూ. 1,50,000 నగదుతో పాటు అనుమతి లేని 49 వేల విలువ చేసే బాణా సంచాను సీజ్ చేశామన్నారు. మడికొండ పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మిస్సింగ్ కేసులో కనిపించకుండా పోయిన వ్యక్తి పోలీసులు గుర్తించామన్నారు.

నేడు, రేపు 163వ సెక్షన్ అమలు

పోలీస్ అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. మొదటి విడత పోలింగ్‌లో భాగంగా సీపీ మంగళవారం డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్త పడాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చి, వెళ్లేమార్గాలు ఒకటే ఉండేలా చూడాలన్నారు. సమస్య తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసు బలగాలను రప్పించుకోవాలన్నారు.

పోలింగ్ సమయం ముగిసిన వెంటనే క్యూలైన్‌లో ఉన్న వరకు మాత్రమే అనుమతించాలన్నారు. పోలింగ్ పరిసరాల్లో ప్రచారాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఫలితాలు ప్రకటించే వరకు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు కవిత, అంకిత్‌కుమార్, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రాంతాల్లో గుంపులుగా ఉండడం నిషేధం

మొదటి విడత పంచాయతీ ఎన్నిల పోలింగ్‌లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో గుంపులు, గుంపులుగా ఉండటం నిషేధమని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలోని బీఎన్ఎస్ 163 సెక్షన్ ప్రకారం.. ఐదుగురు.. అంతకంటే ఎక్కువ ఉండటం నేరమని, ఈ సెక్షన్ బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం రాత్రి 8గంటల వరకు అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

ఊగుతున్న ఊళ్లు

(5వ పేజీ తరువాయి)

అన్నివర్గాల వారి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు. ఇక నామినేషన్లతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో కీలకమైన వారిని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు లిక్కర్ వ్యూహం అమలు చేస్తున్నారు. పొద్దంతా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు చీకటి అయిందంటే చాలు.. పెద్ద మనుషులను మజా చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మందుతో పాటు చికెన్, ఫిష్, మటన్‌లల్లో ఆ పెద్దమనిషికి ఏది ఇష్టమైతే దానితో చీర్స్ కొడుతున్నారు. మద్యం కిక్కులో పెద్దమనుషుల అభయం తీసుకుంటున్నారు.

ఇక పల్లెల్లో కీలక పాత్ర పోషించే కుల, యువజన సంఘాలను సైతం తమకు మద్దతు ఇచ్చేలా అభ్యర్థులు దావత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మద్యంతో పాటు అన్నిరకాల నాన్‌వెజ్‌లు దిగుతున్నాయి. డీజేలతో చీర్స్ కొడుతూ చిందులేస్తున్నారు. అభ్యర్థులకు పొద్దంతా ఓ లెక్క.. రాత్రైతే మరో లెక్కనట్లుగా ఖర్చు తడిసి మోపడవుతోంది. పల్లెల్లో చీప్‌లిక్కర్ తాగేవాళ్లు కూడా ఎన్నికలు కావటంతో బ్రాండెడ్ మందే కావాలంటున్నారు. చీప్ లిక్కర్ పంపిస్తే ముఖం చిట్లించుకుని.. ఎన్నడో ఈ మందు బంద్ పెట్టినా.. బ్రాండెడ్ మందు ఉంటే ఇవ్వు.. లేకుంటే వదిలేయ్.. అంటూ మొహమాటం లేకుండా చెప్పేస్తున్నారు. దీంతో ఫుల్, హాఫ్ బాటిల్స్ కంటే క్వార్టర్స్‌కే ఎక్కువ డిమాండ్ ఉందని మద్యం షాపుల యాజమానులు చెప్తున్నారు.

చిన్న గ్రామ పంచాయతీలో అయితే మద్యం కోసమే రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక పెద్ద గ్రామ పంచాయతీ అయితే రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పైగా ఒక్కొక్క అభ్యర్థి మద్యం కోస మే ఖర్చు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో ఇద్దరు, ముగ్గురు పోటీ చేస్తే మద్యం కోసమే రూ.3లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల కోసం పెట్టే ఖర్చులో సగానికిపైగా మద్యం కోసమే ఖర్చు చేస్తున్నారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఏకగ్రీవమైన గ్రామాల్లో కూడా మద్యం ఖర్చు తప్పటం లేదట.

ఉమ్మడి జిల్లాలో 1,706 గ్రామాలకు ఎన్నికలు జరుగు తుండగా, మద్యం కోసమే ఏకంగా రూ.60కోట్ల నుంచి రూ. 100కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గురువారం మొదటి విడత పంచాయతీ ఎన్నిక లు ఉండటంతో మూడు నాలుగు రోజుల నుంచే మద్యం కొనుగోలు చేసి, నమ్మకస్తుల ఇళ్లల్లో డంప్ చేశారు.

విలువైన పరిశోధనలను అందించాలి

కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువ పరిశోధకులు దేశానికి విలువైన పరిశోధనలు అందించాలని కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. కేయూలో రెండు రోజుల పాటు జరుగనున్న నోబెల్ ప్రైజ్‌డే సెలబ్రేషన్స్‌ను క్యాంపస్‌లో రిజిస్ట్రార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆఫీసర్ రాధిక నేతృత్వంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రిజిస్ట్రార్ మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ వేడుకలు దోహదపడుతాయన్నారు. యువతలో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించాలన్నారు.

11 విభాగాల్లో పోస్టర్ ప్రజంటేషన్

నోబెల్ ప్రైజ్‌డే మొదటి రోజు మంగళవారం కేయూ క్యాంపస్‌లోని 11 విభాగాల్లో పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో 335 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేయూ రిజిస్ట్రార్‌తో పాటు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ మైక్రోబయోలజీ విభాగంలో విద్యార్థుల పోస్టర్లను పరిశీలించారు.

విభాగాల వారీగా ఇవే..

లైఫ్‌సైన్సెస్ విభాగంలో బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఫార్మసీ విభాగాల్లో 212 మంది విద్యార్థులు అలాగే కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్ విభాగాల్లో 123 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రసాయన శాస్త్ర విభాగంలో శాస్త్రం, సమాజాన్ని మార్చిన నోబెల్ రసాయన శాస్త్ర ఆవిష్కరణలు, అనే అంశంపై ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. అలాగే భౌతికశాస్త్రం విభాగంలో 'నోబెల్ భౌతిక ఆవిష్కరణలు ఆధునిక ప్రపంచాన్ని ఎలా ఆకృతీకరించాయి' అనే అంశంపై మంజుల నేతృత్వంలో పోటీలు జరిగాయి.

లైఫ్ సైన్సెస్, ఫార్మసీ విభాగంలో నోబెల్ ఆవిష్కరణలు మానవ ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయి.. అనే అంశంపై విభాగాధితులు ప్రొఫెసర్ జానపురెడ్డి కృష్ణవేణి, శాస్త్రి, సుజాత, కుడ్లె మధుకర్, లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వై.వెంకయ్య నేతృత్వంలో పోటీలు జరిగాయి. వీటితోపాటు ఆర్థిక శాస్త్ర విభాగంలో నోబెల్ ఆర్థిక శాస్త్ర విజేతలు సమాజాలను ఎలా మార్చారు.. అనే అంశం ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఇంగ్లీష్ విభాగంలో సాహిత్యంలో నోబెల్ విజేతలు అనే అంశంపై పోటీలు జరిగాయి. పోటీలకు ఆయా విభాగాల ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పి.వెంకటగోపీనాథ్, సంగీత్, చంద్రశేఖర్, రంగారెడ్డి,ప్రియాంక, కవిత, మహేందర్, రాజేందర్, సాధు రాజేశ్, ఈవీ రావు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు

నేడు ముగింపు

నోబుల్ ప్రైజ్ డే సెలబ్రేషన్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బుధవారం బహుమతులను పంపిణీ చేయనున్నారు. పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత పోటీల్లో విజేతలకు కేయూ సెనెట్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను అందచేస్తామని స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి తెలిపారు. ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, తన్నై నాగ్, చంద్రశేఖర్, రాజా విశ్వనాథన్‌లో హాజరై పరిశోధన అంశాలపై ఉపన్యాసాలు ఇస్తారు.

అవినీతి ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- లోక్‌సత్తా ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు రామ్మోహనరావు
- అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జ్వాల ర్యాలీ
- ప్లకార్డులు పట్టుకొని పాల్గొన్న యాచకులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాల్లో అవినీతి సర్వసాధారణంగా మారిందని, అవినీతికి పాల్పడ్డ ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసినా.. ఎలాంటి ఫలితం లేకుండాపోతోందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బండారి రామ్మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ, లోక్‌సత్తా సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ వేయిస్తంభాల ఆలయం ఎదుట 'అవినీతికి పాల్పడం కన్నా.. అడుక్కు తినడం మిన్న' అంటూ వినూత్న రీతిలో యాచకులతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామ్మోహనరావు పాల్గొని ముందుగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

లోక్‌సత్తా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ.. ఏసీబీ అధికారులకు పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగులు మళ్లీ ఉద్యోగంలో చేరకుండా నిబంధనలు కఠినతరం చేయాలని, పూర్తి స్థాయిలో ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జీతాలు, ఫించన్లు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అడుక్కునే యాచకుల కంటే హీనమైన స్థితిలో ఉన్నారని అన్నారు. అందుకే యాచకులతో వినూత్న రీతిలో ఈ ర్యాలీ నిర్వహించామని ప్రశాంత్ తెలిపారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న యాచకులను సమీకరించి వారికి ప్లకార్డులు అందజేసి నిర్వహించిన ఈ ర్యాలీ వేయి స్తంభాల ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు వినూత్న రీతిలో సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ వీవీ రావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ కార్యవర్గ సభ్యులు అచ్చె అమర్‌నాథ్, బుర్రి కృష్ణమూర్తి, ప్రకాష్, గుండపు సాయిచంద్, ఎల్బీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, నగరంలో వివిధ కూడళ్లలోని బిచ్చగాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన పంబారట్టు వేడుక

- పూజలతో పులకించిన మాధన్నపేట చెరువు కట్ట
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు



అయ్యప్పస్వామిని రథం వద్దకు తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు



పంబారట్టు వేడుకలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

నర్సంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట మాధన్నపేట చెరువులో మంగళవారం అయ్యప్ప పంబారట్టు(జలక్రీడ) ఆద్యంతం కన్నుల పండువగా జరిగింది. అంతకుముందు స్వామివారిని నర్సంపేట పట్టణం నుంచి మాధన్నపేట చెరువు వరకు ఊరేగించారు. మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. కేరళలోని శబరిమలై పుణ్యక్షేత్రం సమీపంలోని పంబానదిలో నిర్వహించే పంబారట్టు తరహాలోనే నర్సంపేటలోనూ ఉత్సవాన్ని జరిపించారు.

నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి - స్వప్న దంపతుల ఆధ్వర్యంలో 25వ మండల పూజా మహోత్సవంలో భాగంగా వారి కుమారుడు పెద్ది నిదర్శన్‌రెడ్డి, కూతురుచే కేరళకు చెందిన తాంత్రికవేత్త గురుస్వామి శంకరన్‌నంబూద్రి పూజా వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయసేవా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయకమిటీ అధ్యక్షుడు పైసా సురేశ్ కమిటీ సభ్యుల నేతృత్వంలో తాంత్రికవేత్త, గురుస్వామి శంకరన్ నంబూద్రి వేద మంత్రోచ్ఛరణల నడుమ జల, పుష్ప తాంత్రిక పూజలను నిర్వహించారు. అనంతరం గర్భగుడిలోని అయ్యప్ప విగ్రహాన్ని నెత్తిన ఎత్తుకొని ఊరేగింపు ట్రాక్టర్‌లో పెట్టాక ట్రాకర్ నడిపి సుదర్శన్‌రెడ్డి ఊరేగింపును ప్రారంభించారు.

అట్టహాసంగా శోభాయాత్ర

అయ్యప్ప ఆలయం నుంచి స్వామి ఊరేగింపు అట్టహాసంగా మాధన్నపేట చెరువు వరకు కళాకారుల డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటనృత్యాలు, డోలుకళాకారుల విన్యాసాలు, కళాకారిణిలు, మాలధారుల నృత్యాల నడుమ ఊరేగింపుగా సాగింది. పలువురు మాలధారులు అశ్వాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

అనంతరం మంగళవారం మధ్యాహ్నం అయ్యప్పపంబారట్టు(జల క్రీడ) ఉత్సవాన్ని, వైభవంగా నిర్వహించారు. చెరువు నీటిలో అయ్యప్ప విగ్రహానికి మాలాధారులతో కలిసి తాంత్రికవేత్త, గురుస్వామి శంకరన్‌నంబూద్రి, ఆలయ అర్చకులు దినేశ్‌మిశ్రాజలక్రీడ వేడుకను ఘనంగా నిర్వహించారు. అనంతరం చెరువు మెట్ల వద్ద ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠించి వేలాదిగా తరలివచ్చిన మాలాధారులు, భక్తుల సమక్షంలో గురుస్వామి వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామిని కొలుస్తూ పాలు, పెరుగు, నెయ్యి, బస్వం (విబూది), పంచదార, చందనం,పసుపు, పండ్లు, తేనె, జలంతో అభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ అభిషేక పూజలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడి, పెద్దిస్వప్న దంపతులు పిల్లలతో కలిసి అభిషేక పూజలను తిలకించారు.

మహాన్నదానం

పంబారట్టు ఉత్సవం సందర్భంగా మాధన్నపేట చెరువు కట్టజాతరను తలపించింది. మాధన్నపేట చెరువులో పంబారట్టు వేడుకలను తిలకించడానికి మాలధారులు, భక్తులు తరలిరావడంతో చెరువుకట్ట సందడిగా మారింది. వేడుక అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడి, ఏర్పాటు చేసిన పంబాసద్దిని (సహపంక్తిభోజనం) మాలధారులు, భక్తులు భుజించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ శింగిరికొండ మాధవశంకర్, కమిటీ సభ్యులు మాదారపు చంద్రశేఖరం శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, ఇరుకు కోటేశ్వర్‌రావు, కొమాండ్ల భూపాల్‌రావు, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డవీందర్ ఆలయకమిటీ సభ్యులతో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ మునిసిపల్ చైర్మెన్ నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గోనె యువరాజ్ అప్పాల సుదర్శన్, రావుల సతీష్, నాగిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ములుగు
బుధవారం 10 డిసెంబరు 2025



పల్లె 'పోరు'.. ప్రలోభాల జోరు!

(5వ పేజీ తరువాయి)

ఈనెల 11న జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు గంపగుత్తాగా ఓట్లు దండుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. విందులు, వినోదాలు ఆఫర్ చేస్తూ ప్రధాన పార్టీల నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లిన వారికి ఫోన్ చేసి రప్పిస్తున్నారని, ప్రయాణ ఖర్చులు సైతం భరించేందుకు వెనుకాడటం లేదని తెలుస్తోంది.

రేపే పంచాయతీ ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతున్నాయి. ములుగు జిల్లాలోని 9 మండలాల (మంగపేట మండలం మినహా)లోని 146 జీపీలు 1290 వార్డులకు ఈ నెల 11, 14, 17 తేదీల్లో పోలింగ్ జరగనుంది. మొదటి విడతలో తాడ్వాయి, ఏటూరునాగారం, గోవింద రావుపేట మండలాల్లోని 48 జీపీలు, 420 వార్డుల్లో ఎన్ని కలు జరుగుతున్నాయి.మూడు మండలాల నుంచి 9 జీపీ లు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 39 జీపీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తు న్నారు. 39 జీపీల నుంచి 139 మంది సర్పంచ్ అభ్యర్థులు 287 వార్డుల నుంచి 532 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు.

ఈ గ్రామాల్లో ఎన్నికలు జరగవు

మొదటి విడత ఎన్నికల్లో గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లోని 6 గ్రామ పంచాయతీల్లో గురువారం పోలింగ్ జరగదని అధికారులు చెబుతున్నారు. గోవిందరావుపేట మండలంలోని ముత్తాపూర్, చల్వాయి, ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి, తాడ్వాయి మండలంలోని అంకంపల్లి, నర్సాపూర్, పంబాపూర్ సర్పంచ్‌లతోపాటు, వార్డు మెంబర్ స్థానాలు పూర్తిగా ఏకగ్రీవం కావడంతో ఆయా గ్రామాల్లో ఎన్నికలు జరగవని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర ● పోలింగ్ సామగ్రి పరిశీలన ● జాగ్రత్తలు పాటించాలని సూచనలు



తాడ్వాయిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దిఇవాకర

తాడ్వాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆయన మంగళ వారం సందర్శించారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియో గించుకునేలా పోలింగ్ ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ లో ఆల స్యం లేకుండా చూడాలన్నారు. రిసివింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ బాక్స్ స్వీకరణ సమయంలో గందరగోళం చోటు చేసు కోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిరం తరం ఉండాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో తేజా ఉన్నారు.

ఆంక్షలు కొనసాగుతాయి

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలకు ఈనెల 9 సాయంత్రం 5గంటలకు ప్రచారానికి తెర పడిందని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ ముగియడానికి 44 గంటల ముందు నుంచి ఆయా మండలాల్లో సైలెన్స్ పీరియడ్ అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఏవిధమైన ప్రచారాలు నిర్వహిం చరాదని స్పష్టం చేశారు. ఈకాలంలో బయటి నుంచి వచ్చిన వ్యక్తులు సంబంధిత గ్రామపంచాయతీ పరిధిలో ఉండకూడదని తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో ప్రజలు గుంపులుగుంపులుగా చేరరాదని, పోలిం గ్‌కు ముందు, పోలింగ్ సమయంలో యంత్రాంగం పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని, ఎలాంటి ఎన్నికల ఉల్లంఘనలు జరగకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఏదేని ఉల్లంఘన జరిగినట్లు గమనిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల నోడల్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని కోరారు.

ఎంపీడీవో కార్యాలయం సందర్శన

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని కలెక్టర్ దివాకర ఏటూరునాగారం ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి సందర్శించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రి నిల్వ, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రిని భద్రపరిచే విషయంలో ఎలాంటిలో పొరపాటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అన్ని వసతులూ కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

• రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

• కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. హైదరాబాద్ నుంచి ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ దివాకర, జిల్లా స్థాయి అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగననున్న రెండవ విడత సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత పోలింగ్ ఈనెల 11న నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో మొదటి విడతలో 3,834 గ్రామపం చాయతీల్లో సర్పంచ్‌లకు, 27,628వార్డులకు ఎన్నిక లు జరుగనున్నాయని అన్నారు. ఓటరు స్లిప్పు కేవలం సమాచారం కోసమేనని, దీనిని గుర్తింపు పత్రంగా పరిగణిం చరదని అన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉండటం తప్పనిసరి అన్నారు. ఓటర్లు తమ గుర్తింపు కోసం ఎపిక్‌కార్డు లేదా రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించిన 18 ప్రత్యామ్నాయ పత్రాలలో ఏదో ఒక దానిని చూపించొ చ్చని అన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పాస్‌బుక్, రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, దివ్యాంగుల ధ్రువీకరణపత్రం, పెన్షన్ పత్రాలు తదితరాలు చూపించి ఓటు వేయొచ్చని పేర్కొన్నారు. పోలింగ్ ప్రారం భానికి ఒక గంట ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ఉంటుందని అన్నారు.

పోలింగ్ కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల పరిధిలో పలు ఆంక్షలు ఉంటాయన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 48గంటల ముందు నుంచే మద్యం అమ్మకాలు, పంపిణీపై నిషేధం అమలులో ఉంటుందని అన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల్లోనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది, ఫలితాల ప్రకటన అనంతరం వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాలన్నారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్, 2గంటల తరువాత వెంటనే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆమె సూచించారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికలు ప్రశాం తంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికలు జరుగనున్న మూడు మండలాలకు మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని అన్నారు. వీడియో కాన్ఫ రెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీపీవో శ్రీధర్ పాల్గొన్నారు.

'మూడో విడత' అభ్యర్థుల ఖరారు

ములుగు జిల్లాలో మూడు మండలాల్లో పంచాయతీ ఎన్నికలు

వాజేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో మూడో విడతలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బరిలో ఉన్న అభ్యర్థుల లెక్క తేలింది. మూడో విడతలో వాజేడు, వెంకటాపురం, కన్నాయిగుడెం మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 3 నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల నుంచి నామినేషన్లను అధికారులు స్వీకరించారు. మంగళ వారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావ డంతో వాజేడు, వెంకటాపురం మండలాల్లో కొంత మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. వాజేడులో మొత్తం 17 జీపీల్లో 85 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీరిలో 33 మంది అభ్యర్థులు ఉపసంహరిచుకున్నారు. బరిలో 52 మంది నిలిచారు. ఏ ఒక్క జీపీ కూడా ఏకగ్రీవం కాకపోవడంతో అన్నింట్లోనూ అభ్యర్థులు పోటీలు ఉన్నారు. అదే విధంగా 152 వార్డులకు 373 మంది నామినేషన్లు దాఖలు చేయగా 313 మంది బరిలో ఉన్నారు. వీటిలో 33 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

వెంకటాపురం మండలంలో 18 జీపీల్లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. అన్ని పంచాయతీలు కలిపి మొత్తం 97 మంది నామినేషన్లు దాఖలు చేయగా 25 మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. బరిలో 62 మంది నిలిచారు. 166 వార్డులకు 984 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ముగ్గురు అభ్యర్థులు ఉపసంహరించుకోగా 381 మంది పోటీలో నిలిచారు. 16 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

వాజేడు, వెంకటాపురం మండలాల్లో బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఉంగరం, కత్తెర, లేడీ పర్సు, గ్యాస్ పోయి, బ్యాట్, తదితర గుర్తులను కేటాయించారు. బరిలో నిలిచిన అభ్యర్థులు బుధవారం నుంచి ప్రచారంతో హోరెత్తించనున్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పాటు కొన్ని స్థానాలలో సీపీఐ, సీపీఎం, బీజేపీ పార్టీలు తమ అభ్యర్థులను పెట్టి సర్పంచ్ స్థానాల గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు పలు మార్గాలను అన్వేషిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఏకగ్రీవాల కోసం అధికార పార్టీ ప్రయత్నించినప్పటికీ అభ్యర్థులు ససేమిరా అనటంతో రెండు మండలాల్లో ఏ ఒక్క జీపీ కూడా ఏక గ్రీవం కాలేదు.

కన్నాయిగూడెం మండలంలోని 11 గ్రామ పంచాయతీలు, 90 వార్డులకు మూడు విడత ఎన్నికలు జరుగుతు న్నాయి. ముప్పనపల్లి జీపీలో సర్పంచ్ స్థానాని కి ఒకటే నామినేషన్ దాఖలు కావడంతో తిప్పనపల్లి లక్ష్మయ్య ఏకగ్రీవమయ్యారు. 10 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 49 మంది బరిలో ఉన్నారు. 90 వార్డులకు 28 వార్డులు ఏకగ్రీవం కాగా తుపాకుల గూడెంలోని ఒక వార్డుకు ఎవరు నామినేషన్ వేయలేదు. 61 వార్డులకు 132 మంది పోటీలో నిలిచారు.

లోపాలు ఉంటే తెలియజేయాలి

ఎన్నికల సిబ్బందితో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మెటీరియల్‌లో ఏవైనా లోపాలు కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ సిబ్బందికి సూచించారు. జిల్లాలో మొదటి విడత జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో గణపు రం, రేగొండ, గోరికొత్తపల్లి, మొగుళ్లపల్లి మండలాల్లోని అన్ని గ్రామ పంచాయ తీల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్ని కల సిబ్బంది ఉదయం 10గంటలకు కేటాయించిన మెటీరియల్ పంపిణీ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. మెటీరియల్ తీసుకున్న అనంత రం వెంటనే వాటిని పరిశీలిం చాలని సూచించారు. ఈ క్రమంలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే అధికారు లకు తెలియజే యాలని చెప్పారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఈనెల 11న జరిగే పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు ఏజంట్లు హాజరుకావాలని, వారి సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించాలని సూచిం చారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అత్యంత జాగ్రత్తతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

ఈవీఎంల గోదాం పరిశీలన

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న ఎన్నికల ఈవీఎం గోదాంను పలు రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. సాధారణ తనిఖీలో భాగంగా ఈవీఎంలను పరిశీలించినట్లు తెలిపారు. నిరంతరం పటిష్ఠ భద్రత మధ్య గోదాంను పర్యవేక్షిస్తూ ఉండాలని, సీసీ కెమెరాలను పరిశీలించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎలక్షన్ డీటీ అబ్బాస్, రాజకీయ పార్టీల నేతలు సిబ్బంది ఉన్నారు. .

ప్రజలకు బానిసలుగా పనిచేస్తాం

ఏటూరునాగారం సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత



ర్యాలీలో కాకులమర్రి శ్రీలత, లక్ష్మీనరసింహరావు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : తనను గెలిపిస్తే ప్రజలకు బానిసలుగా సేవలందిస్తామని ఏటూరునాగారం సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత లక్ష్మీనరసింహరావు అన్నారు. అభివృద్ధి చేసిన చరిత్ర కాకులమర్రి కుటుంబానికి ఉందన్నారు. మంగళవారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2000 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఓడవాడ నుంచి బస్టాండ్ వరకు ఈ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ఎన్నికల్లో ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు అవినీతి రహిత పాలనను అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే గ్రామాన్ని ఎన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తనని అన్నారు. ప్రజల నుంచి తనకు విశేష ఆదరణ లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహరావు, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

(5వ పేజీ తరువాయి)

కుమారుడు రాకేష్(5) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో అతడు ఇంటి వద్దే ఉం డగా తల్లితండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి సమీపంలో ఉండే గంపల శంకర్ తన సొంత ట్రాక్టర్‌ను తీసుకొని వరి కోతలకు బయల్దేరగా రాకేష్‌తోపాటు మరో బాలుడు అతడితో వెళ్లారు. ఇద్దరూ సరదాగా ట్రాక్టర్ ఎక్కారు. ఈ క్రమంలోనే రాకేష్‌తో కలిసి వచ్చిన బాలుడు మార్గమధ్యలోనే దిగిపోయాడు. వ్యసాయం క్షేత్రా నికి చేరుకొని ధాన్యాన్ని నింపున్న ట్రాక్టర్ తిరిగి వస్తున్న క్రమంలో అది అదుపు తప్పింది. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న రాకేష్ ఒక్కసారిగా జారి పడ్డాడు. ట్రాక్టర్ వెనుక భాగంలో పడిపోగా అతడిపై నుంచి టైర్ ఎక్కింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఈ దుర్ఘటనతో డ్రైవర్ భీతిల్లిపోయాడు. ఏం చేయాలో తోచక బాలుడి మృతదేహాన్ని గోనె సంచిలో వేసి సమీపంలోని ఓపెన్‌కాస్టు-3 మట్టి గుట్టల వద్ద పడేశాడు. ఆదివారం సాయంత్రం వరకు బాలుడు ఇంటికి రాకపోవడంతో బాలుడి తల్లితండ్రులు శంకర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పాడు. దీంతో తమ కుమారుడిని శంకర్ కిడ్నాప్ చేశాడంటూ బాలుడి తండ్రి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో పోలీసులు శంకర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా జరిగినదంతా అతడు వివరించాడు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ శంకర్‌ను అరెస్టు చేశామని ఎస్సై అశోక్ తెలిపారు.

పోటీ చేసేవారెవరో తేలింది..

భూపాలపల్లి జిల్లాలో నాలుగు మండలాల్లో మూడో విడత ఎన్నికలు

81 జీపీల్లో 297 మంది సర్పంచ్, 1336 మంది వార్డు అభ్యర్థులు

కాటారం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో మూడో విడత అభ్యర్థుల జాబితా ఖరారైంది. ఈ ఎన్నికల్లో కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్ మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 81సర్పంచ్ స్థానాలకు, 696వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోయింది. రిటర్నింగ్ అధికారుల సమక్షంలో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ పర్వం మంగళవారం ముగిసింది. ఉపసంహరణకు తుది గడువు సాయంత్రం 3గంటల వరకు ఉండగా కొందరు అభ్యర్థులు చివరి నిమిషంలో వచ్చి తమ అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకున్నారు. కాటారం మండలంలో 24జీపీలకు గానూ 19పంచాయతీల్లో 44మంది సర్పంచ్ అభ్యర్థులు ,39మంది వార్డు స్థానాల అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించు కున్నట్లు అధికారులు తెలిపారు. 24జీపీల్లో 106మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నట్లు, 210వార్డులకు గానూ 47వార్డుల్లో సింగిల్ నామినేషన్ రావడంతో ఏకగ్రీవం అయ్యాయని, మిగతా 163 వార్డు స్థానాలకు 418మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎంపీడీవో బాబు తెలిపారు. డివిజన్ కేంద్రమైన కాటారం జీపీలో అత్యధికంగా11మంది అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉన్నారు. వీరాపూర్, ఇబ్రహీంపల్లి జీపీల్లో ద్విముఖ, మేడిపల్లి, విలాసాగర్, ధన్వాడ, జాదరావుపేట, ప్రతాపగిరి, శంకరంపల్లి, గుమ్మళ్లపల్లి పంచాయతీల్లో త్రిముఖ పోటీ, ఇతర 15 గ్రామపంచాయతీల పరిధిలో చతుర్ముఖ, బహుముఖ పోటీలు జరుగనున్నాయి. మహదేవపూర్ మండలంలో 18గ్రామ పంచాయతీలుండగా సర్పంచ్ స్థానాలకు 107మంది నామినేషన్లు వేయగా 51మంది ఉపసంహరించుకోవడంతో 56మంది బరిలో నిలిచారు. 162వార్డు స్థానాలకు ఉపసంహరణల అనంతరం 332మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మహాముత్తారం మండలంలో 24 గ్రామపంచాయతీలుండగా సర్పంచ్ స్థానాలకు 136మంది నామినేషన్లు దాఖలు చేయగా 42మంది విత్‌డ్రా చేసుకోగా 93మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఒకే నామినేషన్ వచ్చిన స్తంభంపల్లి(పీకే)జీపీ ఏకగ్రీవమైంది. 196వార్డు స్థానాలకు 421మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 33 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారని, 39 వార్డులు ఏకగ్రీవం కావడంతో 349మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మల్హర్ మండలంలో 15జీపీలుండగా సర్పంచ్ స్థానాలకు 77మంది నామినేషన్లు వేయగా 35మంది ఉపసంహరించ ుకోగా 42మంది బరిలో నిలిచారని, 128 వార్డుస్థానాలకు 322మంది నామినేషన్లు దాఖలు చేయగా ఉపసంహరణల అనంతరం 237మంది పోటీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

4 పంచాయతీలు ఏకగ్రీవం

నాలుగు జీపీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

రెండో దశ ఎన్నికలు జరిగే పలిమెల మండలంలో పలిమెల జీపీ ఏకగ్రీవం కాగా మూడో దశ ఎన్ని కలు జరిగే మహాముత్తారం మండలంలో స్తంభంపల్లి(పీకే) గ్రామపంచాయతీ, మల్హర్‌రావు మం డలంలో దుబ్బపేట, చిన్నతూండ్ల గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు అధికారులు వెల్లడించారు.

మద్యం, మాంసానికి మస్తు గిరాకీ

అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు..

ఒకరికి మించి ఒకరు ఖర్చు చేస్తున్న అభ్యర్థులు

వెంకటాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారం గడువు దగ్గరపడడంతో గ్రామాలతోపాటు పట్టణాల్లో నివసించే ఓటర్లను కలుస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా సర్పంచ్, వార్డుసభ్యుల ప్రచారంతో సందడి కనిపిస్తోంది. ప్రచారంలో తమవెంట పాల్గొనే వారితోపాటు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడడంలేదు. ఉదయం టిఫిన్ దగ్గరి నుంచి మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో మాంసంతో భోజనం, మూడు పూటలా మందు వరకు అన్ని అభ్యర్థులు సమకూరుస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల జోరు కనిపిస్తోంది. సర్పంచ్ అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటికీ ఉదయం, సాయంత్రం వరకు తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. దీంతో గ్రామాల్లో బెల్టుషాపుల యజమానులు, చికెన్ అమ్ముతున్న దుకాణదారులకు మస్తు గిరాకీ ఉంది. కొన్ని గ్రామాల్లో అయితే నిబంధనలకు విరుద్ధంగా చీరలతోపాటు వంట సామగ్రి పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభ్యర్థులతోపాటు వెంట తిరిగే క్యాడర్లు ఒకరికి మించి ఒకరు ఖర్చు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

(5వ పేజీ తరువాయి)

వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొంది. బైక్‌ను ఢీకొన్న బస్సు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులు కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. తండ్రి సంజీవరెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు వది లాడు. గాయపడిన భరత్‌రెడ్డిని స్థాని కులు ఏటూరునాగారంలోని సామా జిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విష మంగా ఉండటంతో అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై పోలీ సులు కేసు నమోదు చేశారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

కాటారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ 79వజన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా, మండల నాయకులు కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, పార్టీ మండలాధ్యక్షురాలు జాడి మహేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీమల రాజు, అశోక్‌కుమార్, కొట్టె శ్రీహరి, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, మొగిలి, సుజాత, శ్రీనివాస్, దేవదాస్, రమేష్, లింగయ్య, నరేష్, ప్రభుదాస్, సమ్మయ్య, రాంనారాయణ, మహేష్, మల్లయ్య, సమ్మయ్య, హిమాకర్, రాజేష్ తదితరులు ఉన్నారు.

● గణపురం (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలు మండలంలోని చెల్పూరులో డీసీసీ ప్రెసిడెంట్ బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.